క్లుప్తంగా

వేసవి క్రీడా శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియం 24 ఏరియా గ్రౌండ్‌లో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ... సింగరేణి ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 18 ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సాయి స్వరూప్, కిషోర్, జే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



నల్లబండబోడు పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఆర్‌ఓ సత్యప్రసాద్

జూలూరుపాడు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఖమ్మం పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌ఓ) బి సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. నల్లబండబోడు పోలింగ్ స్టేషన్ 90, గుండెపుడి పోలింగ్ స్టేషన్లు 88, 89లను ఏఆర్‌ఓ సత్యప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని గదుల్లో వెలుతురు, విద్యుత్, తాగునీటి సౌకర్యంతోపాటు, ర్యాంప్‌లు, వాషింగ్ రూమ్, టాయిలెట్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు, సెక్టార్ ఆఫీసర్ హరి, జీపీ సెక్రటరీలు పద్మ, హారిక, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: ఎన్నికల కోడ్‌ను గ్రామాలలో విధిగా అమలు చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో కోడ్ ఉల్లంఘన చర్యలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు పనిచేసే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. సారపాకకు చెందిన స్వరాజ్యలక్ష్మి కొంతకాలంగా కాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ప్రతీనెల మందుల కోసం ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్నా చలవాది ట్రస్ట్ అధ్యక్షుడు చలవాది ప్రకాశ్, రాజ్యలక్ష్మి దంపతులు స్వరాజ్యలక్ష్మికి గురువారం రూ.8వేల నగదు సాయం అందించారు.

నాసిరకంగా డ్రెయినేజీ నిర్మాణ పనులు



సాయిరాంతండాలో నిర్మాణ పనులు

జూలూరుపాడు: సాయిరాంతండా గ్రామంలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. నిర్మాణానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా అస్తవ్యస్తంగా కొనసాగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కంకర, ఇసుక, సిమెంటు, నీళ్ల నిబంధనల ప్రకారం మిక్సింగ్ చేయకుండానే డ్రెయినేజీ వాల్స్ నిర్మిస్తున్నారన్నారు. అదేవిధంగా క్యూరింగ్ కూడా సక్రమంగా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు పీఆర్ ఏఈ నాగేందర్‌ను వివరణ కోరగా... నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

అది అసంపూర్ణం.. ఇది అస్తవ్యస్తం

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేకపోవడంతో భారీ వ్యయంతో నిర్మించిన భవనాలు సుమారు ఇరవై ఏళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్న ఆయా భవనాల దుస్థితి ఎవరికీ పట్టడం లేదు. నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా అరణ్యరోధనగానే మిగిలిపోతోంది.

- ఇరవై ఏళ్లుగా సా..గుతున్న నిర్మాణాలు
- వినియోగంలో లేక శిథిలమవుతున్న భవనాలు
- ఎవరికీ పట్టని ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల దుస్థితి



నిర్మాణం పూర్తయిన కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్



అస్తవ్యస్తంగా సుభాష్‌నగర్ కమ్యూనిటీ హాల్

ఇల్లెందురూరల్: ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రెండు గ్రామాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని ఎస్సీ కార్పొరేషన్ నిర్ణయించింది. 2005లో సుభాష్‌నగర్, కొమ్ముగూడెం గ్రామాలలో ఒక్కొక్కటి రూ.5లక్షల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించింది. కానీ భవన నిర్మాణాలు పూర్తికాక ముందే కేటాయించిన నిధులు అయిపోయాయి. మళ్లీ కార్పొరేషన్ నుంచి నిధుల మంజూరు లేకపోవడంతో సుమారు 16 ఏళ్లపాటు నిర్మాణాలలో పురోగతి లేకుండా పోయింది.

2020లో సీడీఎఫ్ నిధులతో..

సుదీర్ఘకాలంగా పడావుపడిన ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం పూర్తి చేయాలని నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు పలువురు నాయకులు విన్నవించారు. స్పందించిన ఆమె సుభాష్‌నగర్, కొమ్ముగూడెంలలో ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నియోజకవర్గ అభివృద్ధి నిధి (సీడీఎఫ్) నుంచి రూ.10 లక్షలు చొప్పున రెండింటికి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కొమ్ముగూడెంలో కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేశారు. సుభాష్‌నగర్‌లో మాత్రం కేటాయించిన రూ.10లక్షలు సరిపోకపోవడంతో నేటికీ అసంపూర్తిగానే ఉండిపోయింది. ఇదిలా ఉండగా కొమ్ముగూడెంలో పూర్తయిన భవనాన్ని 2022 జనవరి 3న అప్పటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. కానీ విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో నేటికీ నిరుపయోగంగానే ఉంది.

గ్రామపంచాయతీలకు అప్పగించినా..

నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ఒక రూపం వచ్చిన సుభాష్‌నగర్, కొమ్ముగూడెం ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్వహణ బాధ్యతలను నాటి ఉన్నతాధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా భవనాలను స్వాధీనం చేసుకున్న గ్రామపంచాయతీ అధికారులు నేటికీ అటువైపు చూసిన దాఖలాలు లేవు. ఫలితంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారగా నిర్మాణ పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

కొద్దిపాటి నిధులు కేటాయిస్తే..

ప్రస్తుతం కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, వంట గది నిర్మిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. సుభాష్‌నగర్‌లో మాత్రం నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. నిధులు ఖర్చు అయ్యాయే తప్ప కనీసం ఒక రూపం కూడా అందిపుచ్చుకోలేకపోయింది. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్ పరిపూర్ణత సంతరించుకునేందుకు మందుభాగం ఫినిషింగ్ చేయడం, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గది, ప్రహరీ పనులు చేయాల్సి ఉంది. వాటిలో తాగునీరు, వంట గది, విద్యుత్ సౌకర్యాలను గ్రామపంచాయతీలు తక్కువ ఖర్చుతో పూర్తి చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రణాళిక కూడా రూపొందించలేకపోయాయి. ఇక పంచాయతీకి సీసీ రోడ్లు వేయాలన్న ఉత్సాహం మినహా కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకోవాలన్న ఆలోచన లేకపోవడం విచారకరం. ప్రస్తుతం ఆదాయం లేక కునారిల్లుతున్న గ్రామపంచాయతీలు ఇలాంటి అవకాశాన్ని అందిపుచ్చుకొని కొద్దిపాటి పెట్టుబడితో సౌకర్యాలు సమకూర్చి భవిష్యత్‌లో పెద్దమొత్తంలో ఆదాయం పొందే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి.

నిధుల కొరత వల్లే జాప్యం



కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులు నూరుశాతం పూర్తి చేసి అందుబాటులోకి త్వరలో తెస్తాం. దీనికోసం అవసరమైన నిధులు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోంది. త్వరలోనే ఒక్కొక్కటిగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కమ్యూనిటీ హాల్స్ ద్వారా గ్రామపంచాయతీ ఆదాయం పెంచుకుంటాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



టి.విష్ణువర్ధన్



బద్రి శేషసురేష్



వి.సాయికుమార్



డి.రఘు

పాల్వంచరూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఈఓ కళాశాల నుంచి 26మందికి ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బోనకల్ మండలం తూటికుంటకి చెందిన రైతు తూటికుంట రత్తయ్య – సుందరమ్మ కుమారుడు డి.రఘు జాతీయస్థాయిలో 143వ ర్యాంక్, వి.సాయికుమార్ 16,281, ఎస్.బద్రిశేష సురేష్ 41,310 ర్యాంక్ సాధించాడని పేర్కొన్నారు. ఇక కిన్నెరసానిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల నుంచి పరీక్ష రాసిన 27మంది విద్యార్థుల్లో 11మంది అడ్వాన్స్‌కు అర్హత సాధించగా.. టి.విష్ణువర్ధన్ 82.03 పర్సంటైల్ సాధించారని ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు.

మైనార్టీ విద్యార్థులకు ర్యాంకులపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించడంపై జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇల్లెందు, పాల్వంచ, అశ్వారావుపేట, బూర్గంపహాడ్(సారపాక) గురుకులాల మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో చాటారని పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్/సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 27న కొత్తగూడెంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి గణేష్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రచార పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశాన్ని లౌకిక దేశంగా కాకుండా హిందూ దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చేసే కుట్ర జరుగుతోందన్నారు. చివరకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కూడా మార్చేకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా అంశాలపై సమూలంగా చర్చించి ఆందోళన కార్యక్రమాలను జనరల్ కౌన్సిల్‌లో రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజు, పూజ, ప్రవళిక, నందిని, సిమ్లా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న యూసఫ్

పాల్వంచ: మోదీ ప్రభుత్వం దేశంలోని కార్మికవర్గాన్ని దోచుకుంటోందని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని ఏఐటీయూసీ జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని సీఆర్ భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు బండి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోని ప్రతీ పౌరుడికి విద్య, ఉపాధి, ఆహారం, ఆరోగ్యం, నివాసం ఉచితంగా అందించడం ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో ఉందన్నారు. దేశంలో పరిశ్రమలను విస్తృతం చేసి ప్రతీఒక్కరి జీవనోపాధులను మెరుగుపర్చాలన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకిగా వ్యవహరిస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను మార్పులు చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, ప్రతీ కార్మికుడు, ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సారయ్య, జమలయ్య, నగేశ్, లక్ష్మి నారాయణ, వెంకట్, మల్లికార్జున్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వీరస్వామి, నజీర్, యూసఫ్, అన్నారపు వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలంపాట

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు వేలంపాట జరగనుందని సీఐ ఎల్.జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటల కల్లా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 40, 41 బూత్ ప్రాంతాల్లో గురువారం బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోదరావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ మాజీ ఉపాధ్యక్షుడు గంధం ప్రసాద్‌గౌడ్, చింతలచెరువు శ్రీనివాసరావు, కటికల రంజిత్, మురళి, ధరావత్ నరేష్, వినయ్, రంజిత్, యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మాట్లాడుతున్న మంగీలాల్

జూలూరుపాడు: ఖమ్మం కలెక్టరేట్‌లోని ఏఓ కార్యాలయంలో గురువారం జరిగిన కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముందుగా జూలూరుపాడులో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ వాహనాల్లో ఖమ్మం వెళ్లారు. అంతకముందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందన్నారు. కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

నామినేషన్ కార్యక్రమానికి వెళ్లిన వారిలో మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, యల్లంకి పుల్లయ్య, సున్నా కృష్ణయ్య, బానోత్ ధర్మా, పోతురాజు నాగరాజు, లకావత్ లచ్చు నాయక్, చలమల నరసింహారావు, బానోత్ నవీన్, కంచర్ల హరీష్, వాంకుడోత్ కిషన్, రాంశెట్టి నాగేశ్వరరావు, చింతా జగన్నాథం, సాయిల కృష్ణయ్య, అల్లాడి లింగారావు, ఎండపల్లి చిట్టిబాబు, అల్లాడి పెద్ద నరసింహారావు, కొమ్మినేని రాంబాబు, గాదె కృష్ణయ్య, పురస్తారపు శ్రీను, తదితరులు ఉన్నారు.

అలవెన్స్‌లు చెల్లించాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): త్వరలో రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ ఎలక్షన్స్‌కు సింగరేణి ఉద్యోగస్తులను వినియోగించుకుంటున్న వారికి టీఏ, డీఏ, ఓవర్ టైమ్ (ఓ.టీ) అవర్స్ అలవెన్స్‌లు చెల్లించాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బి.హనుమంతరావుకు గురువారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యాదర్శి మందా నర్సింహారావు మాట్లాడుతూ... కోలిండియాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోలిండియాలో ఉద్యోగస్తులను వినియోగించుకుంటున్న సందర్భంలో వారికి టీఏ, డీఏతో పాటు ఓటీ భత్యం చెల్లిస్తున్నారని, అదేమాదిరిగా సింగరేణిలో పనిచేసే ఉద్యోగస్తులకు కూడా చెల్లించాలని కోరారు. గాజుల రాజారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్‌బాబు, కూరపాటి సమ్మయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సతీష్‌కుమార్

జూలూరుపాడు: కాకర్ల పాలగుట్టపై కొలువై ఉన్న శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. పాలగుట్ట కింద నుంచి పైన ఉన్న ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాకర్ల ఎంపీటీసీ సభ్యుడు పొన్నెకంటి సతీష్‌కుమార్, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. గతేడాది సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.42 లక్షలు మంజూరయ్యాయని, ఇటీవల మరో రూ.5 లక్షలు మంజూరు కావడంతో మొత్తం రూ.47 లక్షలతో సీసీ రోడ్ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బానోత్ రమాదేవి, చీమలపాటి భిక్షం, రాచబంటి కృష్ణారావు, పాతర్లపాటి వెంకయ్య, సొబ్బని కోటేశ్వరరావు, చెరుకుమల్ల నవీన్, సొబ్బని లాలయ్య, కంచపోగు రాజశేఖర్, జిడుగు రాఘవ, కొండే గోపాల్‌రావు, మందా నరసింహారావు, కొక్కుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం..



కొమరారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇల్లెందురూరల్: మలేరియాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత అన్నారు. మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఆయా పీహెచ్‌సీల పరిధిలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. వేసవి నుంచే తగు జాగ్రత్తలు తీసుకుంటూ వర్షాకాలం నాటికి దోమలను నివారించి తద్వారా మలేరియా వ్యాప్తిని నిలువరించే అవకాశం ఉంటుందన్నారు. ఇంటి ఆవరణలో నిరుపయోగ ఖాళీ పాత్రలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భద్రు, హరికృష్ణ, గున్యా, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

హే... సూర్య భగవాన్




ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద మండుటెండలో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

వేసవి వచ్చిందంటే ఆర్టీసీ ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. బస్సులు ఎక్కేచోట, దిగేచోట బస్సు షెల్టర్లు లేకపోవడంతో రోడ్ల మీదనే ఎండనక, వాననక పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. నిలువ నీడ లేక 44, 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య మండుటెండల్లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. పై చిత్రంలో కొత్తగూడెంలో ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద బస్సు షెల్టర్ లేకపోవడంతో గురువారం మండుటెండలో మహిళలు చీర కొంగులు, టవల్స్ తలపై పెట్టుకుని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇవే పరిస్థితులు జిల్లాలో పలుచోట్ల ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు సంస్థ ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నారు తప్ప, ప్రయాణికుల శ్రేయస్సును మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– చుంచుపల్లి

వేసవిలో పొంచి ఉన్న ప్రమాదం

- వాటర్ ట్యాంకుల నిర్వహణపై నిర్లక్ష్యం
- పైకప్పులు లేకుంటే ప్రమాదమే
- నీటి కోసం అల్లాడుతున్న పక్షులు, కోతులు పడే అవకాశం





పట్టణంలోని వాటర్ ట్యాంకులు

ఇల్లెందు: నిండు వేసవిలో మండుతున్న ఎండలకు పక్షులు, జంతువులు అల్లాడిపోతున్నాయి. కోతులు, కుక్కలకు వాటర్ ట్యాంకుల నుంచి రక్షణ కల్పించాలి. పట్టణంలోని పలు వాటర్ ట్యాంకులకు పైకప్పులు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఓ చోట వాటర్ ట్యాంకులో కోతులు పడిపోయి మృతి చెందిన విషయం విధితమే.. బొగ్గు బావులకు పుట్టినిల్లు ఇల్లెందులో వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. పక్షులకు, కోతులకు దాహార్తిని తీర్చే మార్గాలు లేవు. చెరువులు, వాగులు, వంకలు పట్టణ సమీపంలో లేకపోవటం వల్ల వాటర్ ట్యాంకుల వద్దకే వస్తున్నాయి. దీంతో అవి వాటర్ ట్యాంకులలో పడిపోయే అవకాశం ఉంది. ఈ తరుణంలో పట్టణంలోని వాటర్ ట్యాంకులను రక్షణతో నిరంతర పర్యవేక్షణతో ఉంచాల్సిన అవసరం ఉంది. పట్టణంలోని అన్ని వాటర్ ట్యాంకులకు సమీపంలో చెట్లు అత్యధికంగా ఉన్నాయి. వాటి మీద కోతులు, పక్షులు నీడ కోసం తలదాచుకునేందుకు ఆవాస ప్రాంతాలుగా మార్చుకుంటున్నాయి. ఈ తరుణంలో దాహార్తిని తీర్చుకునేందుకు ట్యాంకులలోకి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

పట్టణ ప్రజలకు మంచినీటికి వాటర్ ట్యాంకులు తప్ప ఇతర మార్గాలు లేవు. పట్టణం కింద బొగ్గు బావులు ఉన్నందున బోర్లు పడే అవకాశం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పాయాయి. వందల మీటర్ల లోతు బోరు వేసినా చుక్క నీరు లేదు. ఈ తరుణంలో పట్టణంలోని 24 వార్డులలో 50 వేల మంది ప్రజలు ఈ వాటర్ ట్యాంకుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. పట్టణంలో కోర్టు ఏరియా వాటర్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్ ట్యాంకు, ఇందిరా నగర్‌లో రెండు ట్యాకులు, చెరువు కట్ట మీద, జగదాంబా సెంటర్, ఫైర్ స్టేషన్ వెనుక వాటర్ ట్యాంకులతో పాటు కొత్త కాలనీలో వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంకులే పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. వీటి ద్వారా అందించే మంచినీటిని ఈ వేసవికాలం వరకు ట్యాంకులను సంరక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రాణాలను కాపాడే మంచినీటిని మనం రక్షించుకుంటే ఉపయోగంగా ఉంటుందని, అన్ని ట్యాంకులకు పైకప్పులు ఏర్పాటు చేయటం, వాటి వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పైకప్పులు ఏర్పాటు చేయాలి..



పట్టణ ప్రజల దాహార్తి తీర్చే వాటర్ ట్యాంకులకు పైకప్పులు ఏర్పాటు చేయాలి. నూటికి నూరు శాతం పేదలు మున్సిపాలిటీ నల్లాల మీద ఆధారపడి నీటిని వాడుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం వేసవిలోనే జరిగే అవకాశం ఉంది. వాటి రక్షణను పటిష్టం చేయాలి.

– వి.హరీష్, ఇల్లెందు

పర్యవేక్షణ పెంచాలి..



పట్టణంలోని పేదలంతా తాగు నీటికి ఉపయోగించుకునే వాటర్ ట్యాంకుల మీద దృష్టి సారించాలి. సంరక్షణను ఏర్పాటు చేయాలి. ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూడాలి. వేసవిలో నీరు దొరకక పక్షులు, కోతులు వాటర్ ట్యాంకుల మీదకు వెళ్లే ప్రమాదం ఉంది.

– నాళ్ల సోమసుందర్, ఇల్లెందు

చర్యలు తీసుకుంటున్నాం..



పట్టణంలోని వాటర్ ట్యాంకుల మీద పైకప్పులు లేనిచోట రక్షణగా సెక్యూరిటీని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాము. ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాము. అన్ని ట్యాంకుల రక్షణకు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

– డి.వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్మన్ ఇల్లెందు